www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 జూలై 2024
5
అన్నమయ్య



జీతాలు ఇచ్చి ఆదుకోండి

-ఎమ్మెల్యేకు పారిశుధ్య కార్మికుల వినతి



జీతాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కు విన్నవిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నెలంతా కష్టపడితే వచ్చే జీతంపైనే మా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, అలాంటిది ఐదు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నామని జీతాలిచ్చి ఆదుకోండంటూ మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. బుధవారం జిల్లా ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఐటియూసి కన్వీనర్ జి.కృష్ణమూర్తి పారిశుధ్య కార్మికుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ 22 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని, నెలంతా కష్టపడితే వచ్చే రూ.12వేలు జీతం కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడం దుర్భరంగా మారాయని ఎమ్మెల్యేకు తెలిపారు. గత ఐదు నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సక్రమంగా జీతాలు వచ్చేలా కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తామని తీరు మారకపోతే కాంట్రాక్టర్ ను మారుస్తామని తెలిపారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

సౌత్‌జోన్ హాకీ పోటీల ప్రారంభోత్సవంలో క్రీడా శాఖ మంత్రి 'మండిపల్లి'



హాకీ ఆడుతూ క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తామని, క్రీడా శాఖలో ఉన్న దొంగ సర్టిఫికెట్లను రూపుమాపుతామని రాష్ట్ర క్రీడా శాఖ, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ హాకీ క్రీడా మైదానంలో సౌత్ జోన్-2 హాకీ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు క్రీడా సంఘ సభ్యులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. క్రీడాజ్యోతి వెలిగించి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం హాకీ స్టిక్‌తో బాలును కొట్టి క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో కేరళ, తమిళనాడు, తెలంగాణా, ఎపి, పుదుచ్చేరి, కర్నాటక నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలు ఈనెల 17 వరకు నిర్వహిస్తారు. చివరి రోజు విజేతలకు మెడల్స్, కప్పు, మెమో ంటోలతోపాటు సర్టిఫికెట్లు ప్రదా నం చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. విద్యతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని, ప్రతి ఉద్యోగంలో స్పోర్ట్స్ కోటా కూడా ఉంటుందని చెప్పారు. సర్టిఫికెట్లతో ఎంతోమంది ఉద్యో గాలు కూడా పొందారని అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రి ఎవరో కూడా తెలియని పరిస్థితి మనకు ఉండేదని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో సుమారు రూ.130 కోట్లు క్రీడల కోసం దుర్వినియోగం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో క్రీడల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేద క్రీడాకారునికి ఉపయోగిస్తామని ఒక్క రూపాయిని కూడా దుర్వినియోగం చేయమని చెప్పారు. 22 మంది కోచ్‌లకు సుమారు ఏడు నెలలు వేతనాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టిందని పేర్కొన్నారు. తాము వచ్చిన 35 రోజుల లోపల వారికి జీతాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం క్రీడలపై యువత ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని, వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా అన్ని చర్యలు చేపడతామని అన్నారు. ఇటీవల తార ఒలింపిక్స్‌లో కూడా ఆంధ్రప్రదేశ్ సంబంధించి ఎంతోమంది ఎక్కడికి వెళ్లి పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి తప్పులు జరగకుండా క్రీడాకారులకు మంచి నైపుణ్యాన్ని అందించడం లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఉద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా క్రీడలకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రానికి రావాల్సి వాటాను కూడా తీసుకొని వచ్చి మరింత క్రీడలను అభివృద్ధి చేస్తామని అన్నారు. క్రీడలకు సంబంధించి దొంగ సర్టిఫికెట్ల సంగతి తేలుస్తానని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలో కమిటీని వేస్తామని, ఈ సర్టిఫికెట్లు తీసుకొని కొంతమంది ఉద్యోగాలు కూడా చేస్తున్నారని వారి భరతం పడతామని పేర్కొన్నారు., రాష్ట్రంలో అవసరమైన ప్రతి చోటా క్రీడామైదానాలు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బిటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో రెండోసారి హాకీ క్రీడలు జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరిన్ని క్రీడలు ఇక్కడ జరిగే విధంగా చూస్తా మని అన్నారు. తాము చదువుకునే రోజుల్లోనూ హాకీ ఆడేవారమని చెప్పారు. చివరగా మంత్రికి, ఎమ్మెల్సీ భూమిరెడ్డికి, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవికి క్రీడా సంఘ సభ్యులు సత్కరించి పూల బొకేలను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హాకీ సిఇఒ నిరంజన్‌రెడ్డి, సెక్రెటరీ హర్షవర్ధన్, ట్రెజరర్ థామస్ పీటర్, కడప హాకీ సెక్రటరీ శేఖర్, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా క్రీడాకారులు

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు



రాయచోటి : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేసి కనీసవేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ డిమాండ్స్ డేలో భాగంగా రాయచోటిలోని సిఐటియు మండల కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ర్యాలీ గాకార్మికులు వెళ్లి మానవహారం చేపట్టి బిజెపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి , స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీసవేతనం రూ.26 వేలు పెంచి కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడులుగా తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. అత్యంత దుర్మార్గమైన చర్యని భావించారు. కార్మికులు ఉద్యోగుల ద్వారా అధికారంలోకి వచ్చినటువంటి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా చేయడం దారుణమని తెలిపారు. దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నీ ప్రయివేటీకరించడం వారి చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్, విద్యుత్, ఆశా, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఆఫ్ కాసు ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, జిల్లాలో రాజకీయ తొలగింపులు వేధింపులు వెంటనే ఆపాలని హెచ్చరించారు. మున్సిపల్ విద్యుత్,అంగన్వాడీలు, ఆశా మధ్యాహ్న భోజనం, సర్వ శిక్ష ,గ్రామా సేవకులు, ప్రకృతి వ్యవసాయ వర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లతో పాటు విద్య, వైద్య రంగంలో పనిచేసే వారందరికి జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కలిగించాలని కోరారు. ఆటో, హమాలీ ,బిల్డింగ్, తోపుడు బండ్లు తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు యం.చెన్నయ్య, వై.శంకరయ్య, కోశాధికారి సి.రాంబాబు ప్రకృతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుకర్ విద్యుత్ రంగం నాయకులు గౌడ్, గంగాధర్, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, విజయమ్మ, అరుణ, నాగమణి, సుమలత గ్రామాసేవకులు నరసింహులు, రామ్మోహన్, గ్రామపంచాయతీ కార్మికులు శ్రీరాములు, సుభద్రమ్మ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, కేశమ్మ, లక్ష్మిదేవి, ఇంజినీరింగ్ కార్మికులు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** జాతీయ కోరికల దినోత్సవంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సిఐటియు డిమాండ్స్ డే కార్యక్రమాలు చేపట్టిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పేర్కొన్నాన్నారు. కార్మిక ప్రదర్శన, ధర్నాను నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యావత్తు కార్మికవర్గానికి వర్తించే కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చిందని, సంఘాలు పెట్టకుండా, సమ్మెలు చేయకుండా కార్మికులను బానిసలుగా మార్చి పనులు చేయించాలని లేబర్‌కోడ్‌లు తెచ్చిందని వివరించారు. లేబర్‌కోడ్‌లు అమలు చేయాలని ఉత్తర్వులివ్వడానికి ఇప్పటి వరకూ భయపడిన బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తర్వులు ఇవ్వడానికి దస్త్రం దులిపిందని అగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్రీవాణి, అధ్యక్షురాలు కుమారి, శాంతమ్మ, నీలిమ, శారద పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** సిఐటియు కేంద్ర కమిటీ, కార్మిక డిమాండ్స్ డే పిలుపు మేరకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా కార్మికుల ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు, సిహెచ్. చంద్రశేఖర్,సిఐటియు జిల్లా నాయకులు, ఎపిఎండిసి, జెఎసి పోరాట కమిటీ, కన్వీనర్ రేకులకుంట వెంకటేష్, సిఐటియు, మండల అధ్యక్షులు, సి.పుల్లయ్య, ఉపాధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి, ముత్యాల శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, నారదాసు సుబ్బరాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, పి జాన్ ప్రసాద్. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్, రాజశేఖర్, విద్యుత్ కార్మిక నాయకులు, కుమార్ రాజా, ఎం సుబ్బరాయుడు, శివారెడ్డి, వెంకటేష్, మధుసూదన్, ఏపీఎండిసి, జేఏసీ నాయకులు, వర్మ, మంగంపేట మైనింగ్ వర్కర్స్ త్రివేణి, నాయకులు, శివ, వీఆర్ఏ సంఘం, కార్యదర్శి, లక్ష్మీకర్, నాగరాజు, బలరాం, ఆనిమేటర్స్ సంఘం ఐకెపి, నాయకులు నగరిపాటి ఆనంద్, పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ నాయకులు బొజ్జ శివయ్య,పాల్గొన్నారు.



రైల్వేకోడూరు : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి



రైల్వేకోడూరు : సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కోర్కెల దినోత్సవం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐసిడిఎస్‌కి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాను రాను బడ్జెట్లో తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు వచ్చే బడ్జెట్లో సమావేశాల్లో ఐసిడిఎస్‌కి బడ్జెట్ పెంచి సంస్థను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, మండల సిఐటియు నాయకులు టి.జాన్‌ప్రసాద్, ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు, వనజ కుమారి, అధ్యక్షులు, ఎన్.రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, కోశాధికారి, జి.పద్మ, దుర్గా, వెన్నెల, మైథిలి, సుజాత, వాణి, బేబీ, స్వర్ణ, సుబ్బలక్ష్మి, జయకుమారి పాల్గొన్నారు. **రాయచోటి టౌన్:** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్వాడీ ఆల్ ఇండియా డిమాండ్స్‌డేలో భాగంగా ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ రూ.5 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీలపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, కూరగాయల బిల్లులు ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు బంగారు పాప, ఖాజాబీ, విజయ, నాగమణి, పద్మజ, శంకరమ్మ, కవిత, ఉమా, జలజ, శ్రీదేవి, జయ, రెడ్డమ్మ, కళ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :**కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా మదనపల్లె ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, ప్రాజెక్టు అధ్యక్షులు మధురవాణి, సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. **మైనర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి :** నంద్యాల జిల్లా పగిడేల మండలంలో 8 ఏళ్ల చిన్నారి వాసంతిపై ముగ్గురు యువకులు అఘాయిత్యానికి పాల్పడడం అమానుషమన్నారు. వీరికి కఠిన శిక్ష విధించి, చిన్నారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి విషయాలు అనేక చోట్ల రోజురోజుకు పెరిగిపోతున్నాయి దీన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, విజయ, మధుమతి, సుగుణ, లక్షిదేవి, సుజన, అనసూయ, గీత, ప్రమీల పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఆశావర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ తహశీల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. డివిజన్‌లో పనిచేస్తున్న ఆశా వర్కర్స్ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద దేశ వ్యాప్త కోర్కెలదినం సందర్భంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశాలతో ఇతరపనులు చేయించరాదని, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మదనపల్లె : ఐసిడిఎస్ పీడీకి వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు



రాయచోటి : ధర్నాలో మాట్లాడుతున్న ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి

డయేరియా నివారణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎట్టి పరిస్థితులలో డయేరియా ప్రబలకుండా పటిష్టంగా నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేటలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డయేరియా నివారణ చర్యలు, జింక్ మాత్రలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, ఇమ్యునైజేషన్, డేటా ఎంట్రీ అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ మండల వైద్యాధికారులు, సిహెచ్‌ఒలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని మండలాలలో జింక్ మాత్రలు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ఇమ్యునైజేషన్, డేటా ఎంట్రీ అంశాలలో ప్రగతి సాధనలో వెనకబడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో జిల్లాలో డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలను పటిష్టంగా అమలుపరచాలన్నారు. ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్త వెళ్లి రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం చేతులు పరిశుభ్రత గురించి, తాగునీటి కలుషితం లేకుండా చూడడం పిల్లలకు డయేరియా వస్తే వెంటనే జింక్ మాత్రలు సరఫరా చేయడం తప్పనిసరిగా జరగాలన్నారు. డయేరియా వస్తున్న ప్రాంతాలలో నీటి పరీక్షలు కూడా చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ఎక్కువగా కేసులు వస్తాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాలలో నీటి నిల్వలు, నీరు కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు. ఎక్కడైనా నీరు కలుషితం అయితే వెంటనేపై అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి చేతుల శుభ్రత ఎలా చేసుకోవాలి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, తల్లులు బిడ్డలకు పాలిస్తున్నప్పుడు, మోషన్ వెళ్ళినప్పుడు ఎలా శుభ్రత పాటించాలో వివరించాలన్నారు. పిహెచ్‌సి, అంగన్వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేసి ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఏ విధంగా వినియోగించాలి, జింక్ మాత్రలు ఏ విధంగా వాడాలి తదితర అంశాలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. రెండు మూడు రోజుల తర్వాత తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని ఎక్కడైనా ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందలేదని, ఆశాలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు వారి పరిధిలోని ఇళ్లను సందర్శించలేదని తెలిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా శ్రద్ధ పెట్టి బాధ్యతాయు తంగా పని చేయాలన్నారు. వివిధ అంశాలలో కొన్ని మండలాల వారు తరచూ ప్రగతిలో వెనకబడి ఉంటున్నారని, అంటే అక్కడ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని అర్థం అవుతుందన్నారు. అలాంటి చోట డిఎంహెచ్‌ఒ, డిఐఒ, డిపిఎంఒలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రగతి సాధనలో వెనుక పడితే మెడికల్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం వైద్య శాఖకు ఏయే బాధ్యతలు అప్పగించింది అందులో మన పనితీరు ఎంత అన్నది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. మనలో కొంతమంది బాగా పని చేస్తూ ప్రగతి సాధనలో ముందున్నారు. ప్రగతిలో వెనుకబడిన వారు బాగా పనిచేస్తున్న వారితో మాట్లాడి లోపాలు గుర్తించి తమ పనితీరును సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.కొండయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, జిల్లా మలేరియా అధికారి, డిపిఎమ్ఒ, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్ హెచ్‌పిలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేయర్, విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-కలికిరి : హాజరు పట్టికలో పేర్లు నమోదు చేయనందుకు సర్వేయర్, విఆర్‌ఒలకు షోకాజ్ నోటీసులు పంపించినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని మున్నోళ్ళపల్లె సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని హాజరు పట్టికను పరిశీలించారు.గత ఐదు రోజులుగా విలేజ్ సర్వేయర్ నాగభూషణం, విఆర్‌ఒ నరేంద్రాలు హాజరు పట్టికలో పేర్లు నమోదు చేయక పోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం వారు ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి నమోదు చేయకపోవడంపై వివరణ ఇచ్చారని తెలిపారు.

కబ్జా చేసిన భూములు పేదలకు పంచాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి అధికారులను బెదిరించి ప్రభుత్వ భూములను అడ్డగోలుగా ఆక్రమించి తన వారి పేరిట తప్పుడు పత్రాలు సృష్టించుకుని అనుభవిస్తున్న కబ్జా భూములను పేదలకు పంచి పెట్టాలని టిడిపి రూరల్ మండలాధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది జనవరి 13న అమర్నాథ్‌రెడ్డి స్వయంగా పాత్రికేయుల సమావేశంలో తాను ఆక్రమించుకున్న భూములు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ప్రభుత్వ భూములు ఆక్రమించి ఎస్టేట్‌లు కట్టుకున్న వారికి ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదని తేల్చి చెప్పారు. ఆక్రమించిన భూములు, ఆస్తులు తిరిగి పేదలకు అప్పజెప్పే రోజున తనకు ప్రోటోకాల్ వర్తింప చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి, టిడిపి నాయకులు గంప శివ, రవి, సర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు జిల్లా పదవులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వ్యవస్థ ఎన్నో ఏళ్లుగా క్రియశీలగా వ్యవహరిస్తూ ప్రజాసేవలో ముందు ఉందని జిల్లా అధ్యక్షులు లయన్ పి. శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి టౌన్ సభ్యులలో జిల్లా గ్లోబల్ సభ్యుల బృందంగా ఏర్పడ్డారు. కో-ఆర్డినేటర్‌గా వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి ఎస్ హరినాథరెడ్డి, జోన్ చైర్మెన్‌గా మాజీ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, జిల్లా గవర్నర్‌గా లయన్ యం గౌతమ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పదవులకు న్యాయం చేస్తామని, జిల్లాలో ఉన్న అన్ని క్లబ్ సభ్యులతో పరస్పర సంబంధాలు ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. పదవులు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాయచోటి : గిరిజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ మదనపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి గూండా వీరనాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషదాయకమని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతియ అధ్యక్షులు నాగేంద్రనాయక్, చౌహన్ బుదవారం తెలిపారు. గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారి రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో మదనపల్లి డివిజనల్ ఇన్‌ఛార్జిగా వీరనాగయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రంలోని గిరిజన ప్రజలకు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రజలపై భారాలు మాత్రం తప్పేలా లేవని, ఆదే జరిగితే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ప్రజలకు హామీనిచ్చారని, మంగళవారం సచివాలయంలో జరిగిన విద్యుత్ శ్వేతపత్రం కార్యక్రమంలో భారాలు మోపే దిశగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు ఉందని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపిఇఆర్‌సి)కి 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన రూ.17,137 కోట్లు ట్రూఅప్‌ను ప్రతిపాదించాయి. ప్రస్తుతం ఇది పెండింగ్‌లో ఉందని, శ్వేతపత్రంలో ఈ మొత్తాన్ని కూడా రీకవరి కావాల్సి ఉందని ప్రభుత్వం పేర్కొంది అంటే ఈ భారం ప్రజలపై పడనుందని అన్నారు. ఇప్పటికే ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలు ప్రజలకు భారంగా మారిన సంగతి తెలిసిందేనని వివరించారు. టారీఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తానని తాను చెప్పలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం కూడా గర్హనీయం అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లను బిగింపును చంద్రబాబు ప్రతిపక్షంలో వ్యతిరేకించారని, ఇప్పుడు మాత్రం ఏర్పాటు చేసిన మీటర్లను వేస్ట్ చేయకుండా ప్రభుత్వ ఖర్చుతో సోలార్ ప్యానెల్స్ బిగిస్తామని చెప్పడాన్ని తప్పుపట్టారు. విద్యుత్ భారాలు మోపడానికి సిద్ధపడితే ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.



మురుగునీటి కాలువలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యం

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు : సర్పంచ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సుబ్రమణ్యం(మధు) తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం కావడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, దోమల ప్రబలకుండా పంచాయతీ పరిధిలో గత కొద్ది రోజులుగా మురుగునీటి కాలువలను, చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని ఒకే చోట నిలువ ఉంచరాదని, ఇళ్ల వద్ద మురుగు నీరు లేకుండా శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. పేరుకుపోయిన కాలువలను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుభ్రం చేసిన అనంతరం బ్లీచింగ్ పౌడర్ ను పిచికారి చేస్తున్నట్లు వివరించారు. ఇళ్ల వద్ద శుభ్రంగా ఉంచుకోకపోతే దోమల ప్రబలి తద్వారా, డెంగ్, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతూ అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, కాచిన నీటిని త్రాగాలని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా పారిశుధ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



ఆక్రమణకు గురైన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

ఆక్రమణకు గురైన పాఠశాల భవనం స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లెలో మూతబడిన పాఠశాల భవనాన్ని స్థానిక వైసిపి నాయకుడు ఆక్రమించుకున్నారని స్థానికులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఫిర్యాదు మేరకు తహశీల్దార్ శ్రీనివాసులు, ఇఓపిఆర్‌డి ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాతారెడ్డిలు బుధవారం చెరువు ముందర పల్లెకు వెళ్లి అంగన్వాడీ పాఠశాల స్థలాన్ని పరిశీలించి ఆక్రమ గురైన పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకొని అంగన్వాడీ సిబ్బందికి అప్పజెప్పారు. ఆయన వెంట విఆర్ఓ వెంకటసుబ్బయ్య, సర్వేయర్ మణికంఠ, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-సుండుపల్లె



మాట్లాడుతున్న తహశీల్దార్ జరీనా బేగం

మండలంలో ఇసుక మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ జరీనాబేగం పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని అవసరాల నిమిత్తం రవాణా చేసుకోవచ్చని తెలిపారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. బుధవారం ప్రజాసంఘాలు, స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ సిబ్బందిని పంపించి అక్రమ రవాణాలను అడ్డుకున్నట్లు తెలిపారు. మండలంలో పక్కా గృహాలకు అవసరమైన మట్టిని అనుమతి పొంది తీసుకెళ్లవచ్చని చెప్పారు. అనుమతి లేకుండా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో ఉచిత ఇసుక ప్రారంభించడం జరిగింది దని, మట్టి కూడా మండలములో అవసరం వచ్చేవరకు అనుమతితో తోలు కోవచ్చని తెలిపారు.

కలెక్టర్‌ను సన్మానించిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లె

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చామ కూరి శ్రీధర్‌ను మండలానికి చెందిన కూటమి నాయకులు కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ద్వారా నిరంతరం అలసత్వం ప్రదర్శించవద్దని కోసం జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ ఫలాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జనసేన ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, తంబళ్లపల్లి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు మల్లికార్జున నాయుడు, మదనపల్లి జనసేన నాయకులు అశోక్, కూటమి నాయకులు రమణగౌడ పాల్గొన్నారు.

సర్వజన బోధనాస్పత్రిలో వైద్య సేవలు మెరుగవ్వాలి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందని, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం ఎమ్మెల్యే సర్వజన బోధన ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారి వార్డుల్లో పర్యటిస్తూ రోగులను పరామర్శిస్తూ వారికి అందుతున్న వైద్య సేవలను గురించి ఆరా తీశారు. వార్డుల్లో ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య పనులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. విధుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన, పారిశుధ్యం లోపించిన వర్కర్లపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వసతుల్లో నాణ్యత లోపిస్తే వర్కర్లపైనా, కాంట్రాక్టర్ పైనా మార్చేదుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణ నిమిత్తం ఆసుపత్రి భవనంపై నిర్మిస్తున్న తాత్కాలిక భవనాలు ను పరిశీలించారు. ర్యాంపు నిర్మాణ ఇంకా నిర్మాణంలో ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్ ను పిలిపించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరీ క్రిటికల్ కేసులు వస్తే తప్ప రిఫర్ల్ చెయ్యొద్దని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులు నీటి పన్ను చెల్లించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి నిమ్మనపల్లె

బహుదా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులు నీటి తీరువ పన్నును చెల్లించాలని మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లి మండలంలోని బహుదా సాగునీటి ప్రాజెక్టును ఆయన స్థానిక తహశీల్దార్, బహుదా ప్రాజెక్టు ఎఇ లతో కలిసి పరిశీలించారు. బహుదా ప్రాజెక్టు నిర్వహణ, నీటి లభ్యత, నీటి సామర్థ్యం, ఆయకట్టు భూమి, రైతులు వంటి వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులలో బహు దానది ప్రధానమైనదని అన్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 0.4 టిఎంసిలని తెలిపారు. బహుదా ప్రాజెక్టు కింద నిమ్మనపల్లి, వాల్మీకిపురం మండలాలకు చెందిన సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, ప్రస్తుతం రైతుల ప్రధానంగా వరి, టమోటా వంటి పంటలను సాగు చేస్తున్నారని అన్నారు. బహుదా ప్రాజెక్టుకు నీరు చేరాలంటే ప్రస్తుతం కేవలం వర్షం మీదనే ఆధారపడి ఉందని, ఆయకట్టు రైతులు హంద్రీనీవా జలాలను బహుధా ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని ఇదివరకే కోరడం జరిగిందని అన్నారు. వారి అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. బహదా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఎకరానికి రూ.200 చొప్పున నీటి తీరువ పన్ను చెల్లించాలన్నారు, తద్వారా రైతుల భూమి కూడా సాగులోఉండడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు



బహుదానది సందర్శనకు వెళుతున్న ఆర్‌డిఒ హరిప్రసాద్

చెల్లించే పన్ను రుసుమును తిరిగి ప్రాజెక్టు నిర్వహణకు వినియోగించడానికి ఉపయోగపడుతుందని వివరించారు. బహుదా ప్రాజెక్టులో మత్స్యశాఖ సహకారంతో, మత్స్యశాఖ సహకార సంఘం ద్వారా ప్రాజెక్టులో చేప పిల్లలను పెంచి, మత్స్య సంపదను వృద్ధిచేసి విక్రయించడం జరుగుతున్నాదని, తద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడు తున్నాదని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజు, బహుదా ప్రాజెక్టు ఎఇ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాంప్ర సాద్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి



కలికిరి: అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిహెచ్ చిన్నరెడ్డప్ప

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కె.దొడ్డిపల్లి సచివాలయంలోని కత్తివారిపల్లి గ్రామంలో డయేరియాపై అవగాహన కల్పించినట్లు పాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి.కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సోకే డయేరియా అంతమొందించడం అనే కార్యక్రమం విస్తృతంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. నీళ్ల విరేచనాలపై ఒఆర్ఎస్ ప్యాకెట్ల తయారు చేయడం ఎలా వినియోగించడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కత్తివారిపల్లి గ్రామంలో ఆశ ఆరోగ్య కార్యకర్త ఇంటింటి సర్వేలు నిర్వహించి ఎలాంటి అతిసార కేసులు లేవని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్‌బాబు, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య,హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్.పి.గోపికృష్ణ, ఆరోగ్య కార్యకర్త సి.లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు అమరావతి, పద్మావతి గ్రామస్తులు పాల్గొన్నారు.

కలికిరి: ప్రజలు జాగ్రత్తలు పాటిస్తేనే అతిసార నుంచి దూరంగా ఉండవచ్చునని మేడుకుర్తి సిహెచ్‌సి వైద్యులు చిన్నరెడ్డప్ప తెలిపారు. బుధవారం అతసారపై మహల్, రంగనాథపురంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజలందరూ తినే ముందు చేతులు శుభ్రం చేసుకువాలని, వేడిచేసిన నీలను చల్లర్చి తాగాలని, అతిసార వ్యాధికి గురైన వారు ఒఆర్ఎస్ పాకెట్స్ ని ఒక లీటర్ నీటికీ కలుపుకొని 24గంటలోపల తాగాలని, జింక్ మాత్రలు 20 ఎంజి 14రోజులు పాటు వాడాలని తెలిపారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హేమలత, ఎంఎల్ హెచ్‌పి షరీఫా, ఎఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కలకడ: డయేరియాపై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

పండ్లతోటల పెంపకంపై అవగాహన : ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎంపిడిఒ పోలప్ప

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు పండ్లతోటలు పెంపకంపై దృష్టి సారించేలా ఉపాధి సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపిడిఒ పోలప్ప సూచించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పండ్లతోటలతో పాటు వ్యాపార పంటలైన పూల తోటలు, సిరికల్చర్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాసం పెంచుకోవడానికి షెడ్లు నిర్మాణం, పొలం గట్లపై మొక్కలు పెంపకం చేపట్టవచ్చునని అన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించేలా అవగాహన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ నారాయణస్వామి, ఎస్ఆ ర్‌డిఎస్ జెఇ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్నాయక్, సుజాత, చక్రవర్తి, చిన్నప్ప, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలవ్వాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా విద్యాశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్ నందు జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా విద్యాశాఖ, పౌర సంబంధాల శాఖ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఎన్ని పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది, ఎలా అమలు అవుతోంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం అమలుపై పర్యవేక్షణ ఏ విధంగా చేస్తున్నారు అని కలెక్టర్ అడగగా దీనికి సంబంధించిన మొబైల్ యాప్ గురించి జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి వివరించారు. అనంతరం జిల్లాలో మధ్యాహ్నం భోజన పథకం పటిష్టంగా అమలవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, పౌర సంబంధాల శాఖ అధికారి రఘురాం, ఐసిడిఎస్ పీడీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, ఆయా శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



సమస్యను అదాలత్‌కు వివరిస్తున్న రైతు

విద్యుత్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

విద్యుత్ అదాలత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. పీలేరు ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ కార్యాలయంలో బుధవారం ఛైర్ పర్సన్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 7 కేసులు విచారించి, వాటికి అక్కడికక్కడే పరిష్కరించారు. పీలేరు మండలం, తలుపుల పంచాయితీ, చెన్నయ్యగారిపల్లెకు చెందిన కన్నయ్య అనే రైతు మాట్లాడుతూ తమ గ్రామంలో నాలుగు రోజుల క్రితం పిడుగుపాటు కారణంగా 6 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని, తక్షణం వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి, రైతులను ఆదుకోవాలని కోరారు. అందుకు గ్రామీణ ఎఇ రామ్మూర్తి సమాధానమిస్తూ దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను పీలేరులోని ట్రాన్స్‌ఫార్మర్‌లను మరమ్మతు కేంద్రానికి చేర్చాలని, వాటిని మరమ్మతు చేయించి రైతులకు సమస్య లేకుండా అమర్చడం జరుగుతుంధని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ విద్యుత్ శాఖలో విద్యుత్ సిబ్బంది సేవలు అందించడంలో జాప్యం చేస్తే అదాలత్ ను ఆశ్రయించి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. వినియోగదారుల కోసమే 2005లో ప్రభుత్వం ఈ అదాలత్ ఏర్పాటు చేసిందని చెప్పారు. 2011లో చిత్తూరు జిల్లాలోని కుప్పం రెస్కో కూడా ఈ ఫోరం పరిధిలో చేర్చడం జరిగిందని తెలిపారు. ఫోరంలో ఫీజుల ఏర్పాటు, కేబుల్స్ మరమ్మతు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ ఒల్టేజీ హెచ్చు-తగ్గులు వంటి సమస్యల పరిష్కారానికి సంబంధిత వినియోగదారులు యజమాని పేరు, క్యాటగిరి, ఇతర మార్పిడి అంశాలను నమోదు చేసి, వాటిని పరిష్కరించు కోవచ్చని తెలిపారు. ఫోరంలో ఫిర్యాదు చేయడానికి లాయర్ ఫీజులు ఉండవని అన్నారు. ఫోరంలోని అధికారులు ఫిర్యాదు రిజిస్టర్ చేసి, సంబంధిత అధికారుల సంజాయిషీ స్వీకరించి, నిబంధనలకు అనుగుణంగా ఫీజు చెల్లించబడుతుందని స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి స్వీకరించిన సమస్యను ఫోరం 60 రోజుల్లోగా పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాలను గుర్తించి తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె. రామ్మోహనరావు, ఎస్ఎల్ అంజనీ కుమార్, గాయం ఈశ్వరమ్మ, ఇఇ మునిచంద్ర, ఎడిఇలు సుధాకర్, శ్రీనివాసులు, ఎఇలు రామ్మూర్తి, జ్యోతిప్రసాద్, పురుషోత్తం రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తా చాటిన 'అన్నమాచార్య'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పదిమంది విద్యార్థుల బృందం ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన 73వ ఇండియన్ ఫార్మసోటికల్ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో తమ నృత్య ప్రదర్శనతో అలరించి రూ.5వేలు నగదు బహుమతి, కన్సోలేషన్ బహుమతిని గెలుపొందినట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి తెలిపారు. ప్రదర్శనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో బుధవారం ఫార్మసీ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డి తన చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో జరగబోయే పోటీల్లో ముందంజలో రాణించాలని కోరారు. ఈ ప్రదర్శనలో జి.క్రాంతికుమార్, సి.సాయి, సుకీర్తన్‌రెడ్డి, టీ.ప్రవీణ్, టి.దీపికా, పి.ధీమతి, ఎం.దేవేంద్రనాయక్, ఎం.ఝాన్సీ, బి.లిఖిత, వి.కళ్యాణి,సి.లిఖిత, జి.జస్వంత్‌లు ప్రదర్శనలో పాల్గొన్న ట్లు తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ సి.ఎలారెడ్డి, కోశాధికారి సి.అభిషేక్‌రెడ్డి, చైర్మన్, సి.రామచంద్రరెడ్డి పై బహుమతులు సాధించి నందుకు విద్యార్థులను ప్రశంసించారు.

బిసి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో బిసి హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ విజయవాడలో బిసి మంత్రి సవితకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ బిసి హాస్టల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని, గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో బిసి సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేశారని అన్నారు. కనీసం హాస్టల్ మౌలిక వసతులు కూడా లేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సమస్యలన్నిటిని పరిష్కరించాలని మంత్రి సవితను కోరామన్నారు. ఆమె సానుకూలంగా స్పందించారని, ఇప్పటికే మౌలిక వసతులు కోసం అంచనా వేస్తున్నామని చెప్పినట్లు తెలిపారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర రవాణా క్రీడలు యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్యాస్ ధరలో ధరలపై మంత్రి చర్చించారు. ధరలపై తదుపరి సమావేశం పెట్టుకొని మాట్లాడుకుందామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట శివ సాయి, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి నాయక్, వైస్ ప్రెసిడెంట్ చక్రవర్తి, ప్రభాకర్ నాయుడు, రాధాకృష్ణ, రాయలసీమ డిస్ట్రిబ్యూటర్స్ జాయింట్ సెక్రటరీ సివి సుబ్బారెడ్డి, సీనియర్ డిస్ట్రిబ్యూటర్ రాహుల్, రెడ్డి కడప జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మహిళా డిస్ట్రిబ్యూటర్ సరోజరెడ్డి పాల్గొన్నారు.

'యల్లటూరు'ను సన్మానించిన మాజీ సర్పంచ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్లమెంట్ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాసరాజును ఊటుకూరు మాజీ సర్పంచ్, టిడిపి నేత మన్నేరు లక్ష్మీ నరసయ్య బుధవారం మన్నూరులోని యల్లటూరు భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, స్థానిక ఎన్నికల్లో వారికే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి పల్లె గ్రామస్తులు మల్లెం సుబ్బయ్య, కావేరిగారి వెంకటరమణ, నామాల శంకర్, మన్నేరు లక్ష్మీనరసింహ, కోలాటం నరసింహ, పల్లంశెట్టి కృష్ణయ్య, వీరనాగయ్య, పూల యశ్వంత్ పాల్గొన్నారు.



యల్లటూరు శ్రీనివాసరాజును సన్మానిస్తున్న మాజీ సర్పంచ్, కూటమినాయకులు

క్రైం కార్నర్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఉన్న వంకలో ఆక్రమంగా ఎలాంటి పర్మిట్లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను రామాపురం పోలీసులు అదుపులోకి తీసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ విఎల్.ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఇసుక కావాల్సిన లబ్ధిదారులు ఆధార్ కార్డు రేషన్ కార్డు తీసుకొని సంబంధిత అధికారులు సంప్రదించి ఇసుకను తీసుకోవచ్చునని అన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డేరంగుల పెద్ద ఓబులేసుపై కేసు నమోదు

- సిఐ సూర్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అక్రమంగా భూమిలోకి ప్రవేశించి ప్రజలను మోసం చేస్తూ భూయజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్న డేరంగుల పెద్ద ఓబులేసుపై కేసు నమోదు చేసినట్లు సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో కూడా కేసు నమోదయి రిమాండుకు వెళ్లిన డేరంగులు పెద్ద ఓబులేసు మరల యధావిధిగా ప్రజలను మోసం చేసేందుకు, ప్రజలకు నమ్మబలికి ఇతరులు భూమిలోకి ప్రవేశించినందు కుగాను మరలా కేసు నమోదు చేసినట్లు సిఐ సూర్యనారాయణ తెలిపారు. అమాయక ప్రజలు ఇలాంటి వారి నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

అక్క, తల్లిని ఇబ్బంది పెడుతున్నాడని హత్య

- అబ్దుల్ రహీం హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 6న గుణిగుంట్ల రోడ్డులోని సమాధుల వద్ద సమీపంలో జరిగిన అబ్దుల్ రహీం హత్యకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేశారు. మద్యానికి బానిసై తన అక్కను, తల్లిని వేధిస్తున్నందుకే అబ్దుల్ రహీంను అతడి బావ హత్య చేసినట్లు రాయచోటి అర్బన్ ఇన్‌ఛార్జి సిఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పట్టణంలోని సిద్దిక్ మసీదు వద్ద నివాసం ఉన్న అబ్దుల్ రహీం గత కొంతకాలంగా తానా సమీపంలోని కెజిఎన్ చికెన్ సెంటర్ లో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై గత కొంతకాలంగా తన తల్లిని సొంత అక్కను వేధిస్తూ డబ్బులు ఇవ్వమని వాళ్లకు రకరకాల ఇబ్బందులు పెడుతుండేవాడని వేధింపులు తట్టుకోలేక ఈ విషయాన్ని మృతుని పెద్ద అక్క భర్త ఇర్షాద్ అలీకు తెలిపారు. ఈ విషయంపై పలుసార్లు మందలించిన తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఎలాగైనా హతమార్చాలని అనుకున్నారని చెప్పారు. ఈనెల 6న స్నేహితుడు సాయికుమార్ సాయంతో గునిగుంట్ల రోడ్డులోని సమాధుల వద్ద కంప చెట్లలో తీసుకెళ్లి గొంతు కోసి చంపి అక్కడే పడేసి వెళ్లిపోయారని అన్నారు. అబ్దుల్ రహీం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ భక్తత్సలం తన సిబ్బందితో కలిసి రాయచోటి వీరబల్లి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కావలవాండ్లపల్లి క్రాస్ వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోను, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



నిందితుడి అరెస్టును చూపుతున్నసిఐ, పోలీసు సిబ్బంది